పక్షుల దాహార్తిని తీర్చండి!

● ప్రజలకు స్టాలిన్ పిలుపు



పక్షుల కోసం మట్టితొట్టెలో నీరు పోస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎండలో అలమటించే పక్షుల ఆకలి దప్పులు తీర్చాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ పేజలో ఓ సందేశం వెలువరించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి నుంచే ఎండలు అధికమయ్యాయని, ప్రస్తుతం అన్ని చోటా వంద డిగ్రీల ఫారెన్‌హీట్ కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలు నగరాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో ఎండవేడిని తట్టుకోలేని పక్షులపై ప్రజలు దయచూపాలని, దాహంతో అలమటించే పక్షులకు కాసింత చల్లటి నీటిని పరిశుభ్రమైన గిన్నెలో పోసి ఉంచాలని, అదే సమయంలో పక్షులు తినే నూకలు, శెనగపప్పులు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలను కూడా అందించి వాటి ఆకలిని తీర్చాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజానీకం తన విజ్ఞప్తి మేరకు పక్షుల ఆకలిదప్పులు తీర్చేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సందేశంతోపాటు ముఖ్యమంత్రి స్టాలిన్ చేతిలో ఓ విదేశీ జాతి శునకాన్ని పట్టుకుని తన ఇంటి సమీపంలో పూల కుండీల పక్కనే మట్టితో తయారైన చిన్న చిన్న తొట్టెల్లో నీళ్ల పోస్తున్నట్టు తీసిన ఫొటోలను కూడా ఎక్స్‌పేజీలో వెలువరించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

● మసీదులు, ఈద్గాల్లో నమాజులు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం 'ఈద్-ఉల్-ఫితర్'ను ముస్లింలు కోలాహలంగా జరుపుకున్నారు. సౌదీ అరేబియాలో శనివారం చంద్రుడు దర్శనమివ్వడంతో ఆ దేశంతోపాటు దేశంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం రాజధాని నగరంతో పాటు పలు ప్రాంతాల్లో నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ జరుపుకోవాలని తమిళనాడు చీఫ్ హాజీ డా.సలాహుద్దీన్ ముహమ్మద్ అయూబ్ ప్రకటించారు. ఆ మేరకు సోమవారం ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలకు హాజరై ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే, పలు ప్రాంతాల్లో ప్రజలకు మిఠాయిలు తినిపించి, షీర్ కుర్మా, బిర్యానీ ఇచ్చారు. దానధర్మాలు కూడా చేశారు. నాగపట్టణం జిల్లాలో ప్రసిద్ధిచెందిన నాగూర్ దర్గా, ట్రిప్లికేన్ పెద్ద మసీదు, థౌజండ్ లైట్స్, పెరియమెట్ మసీదులతో పాటు ఎగ్మూర్ కార్పొరేషన్ మైదానం, బ్రాడ్‌వే డాన్‌బాస్కో పాఠశాల మైదానం, రాయపేట వైఎంసీఏ మైదానంలో ముస్లింలతో పాటు మహిళలు, చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలకు పాల్గొన్నారు. అదే విధంగా, తిరునల్వేలి, తెన్‌కాశి, మదురై, రామనాథపురం, తిరుచ్చి, పుదుకోట, కోవై, విల్లుపురం సహా రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ పర్వదినం సందర్భంగా భారీ బందోబస్తును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది.





చిన్నారుల ఆలింగనం - బ్రాడ్‌వే డాన్‌బాస్కో పాఠశాల మైదానంలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు







నమాజు చేస్తున్న ముస్లిం సోదరులు - ప్రార్థనలకు హాజరైన మహిళలు



విద్యుత్ వెలుగుల్లో మసీదు

అన్నామలైకి త్వరలో ఉద్వాసన?

● రేసులో తమిళిసై, మురుగన్

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాపై దృష్టి సారించిన బీజేపీ అధిష్టానం పార్టీ కొత్త అధ్యక్షుడిని నియమించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఈ విషయమై పార్టీకి సుదీర్ఘకాలం సేవలందించిన సీనియర్ నేతల అభిప్రాయాలను సైతం సేకరిస్తోంది. గత రెండేళ్లుగా అన్నాడీఎంకే, బీజేపీ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం సాగింది. బీజేపీతో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తుపెట్టుకునే ప్రసక్తి లేదంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) చెబుతూ వచ్చారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలో తమ పార్టీ నాయకత్వంలోనే మెగా కూటమి ఏర్పడుతుందన్నారు. నెల రోజుల క్రితం వరకూ రాజకీయ పరిశీలకులంతా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా త్రిముఖ పోటీ తప్పదని భావించారు. డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, బీజేపీ కూటమి బరిలోకి దిగుతాయని ఊహించారు. అయితే అందరి అంచనాలను తలక్రిందులు చేసేలా ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నుంచి ఈపీఎస్‌కు పిలుపు రావటం ఆయన ఆగమేఘాలపై హస్తినకు వెళ్లడం. చర్చలు జరపటం చకచకా జరగటంతో బీజేపీ, అన్నాడీఎంకే మధ్య పొత్తు మళ్లీ పొడిచిందని, రాష్ట్రంలో రెండాకుల మధ్య తామర వికసించనుందని ఆ ఇద్దరి నేతల భేటీ స్పష్టమైన సంకేతాలనిచ్చింది. అదే సమయంలో అన్నాడీఎంకే సీనియర్ నేత సెంగోటయ్యన్ అమిత్‌షాను రహస్యంగా కలుసుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితులలో అన్నాడీఎంకే నేతలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకి ఉద్వాసన పలికితేనే పొత్తు పొసగుతుందని చెబుతూ ఆ పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈపీఎస్ ఢిల్లీ నుండి తిరిగొచ్చిన కొద్ది రోజులకే అన్నామలై కూడా ఢిల్లీ వెళ్లి బీజేపీ జాతీయ నాయకులతో సమావేశమై తన వాదనలు వినిపించారు. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య ఎన్నికల పొత్తు దిశగా స్నేహపూర్వకమై చర్చలు జరగాలంటే అన్నామలైని పార్టీ పదవి నుండి తొలగించాలని ఈపీఎస్ సహా పలువురు నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

కొత్త నేత ఎవరు?...





అన్నామలైకి పార్టీ అధిష్టానం ఉద్వాసన పలికితే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో ప్రధానంగా ముగ్గురున్నారు. గతంలో పార్టీ అధ్యక్షురాలిగా పనిచేసిన మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, పార్టీ అధ్యక్షుడిగా సేవలందించి, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న ఎల్.మురుగన్, సిట్టింగ్ ఎమ్మెల్యేలు వానతి శ్రీనివాసన్, నయినార్ నాగేంద్రన్‌తోపాటు సీనియర్ నేత హెచ్.రాజా కూడా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త నాయకుడి ఎంపిక తప్పనిసరి అయితే మురుగన్‌ను గానీ తమిళిసైనిగానీ పార్టీ అధిష్టానవర్గం నియమించే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయి. వీరితోపాటు కోవై మురుగానందం పేరు కూడా పార్టీ అధిష్టానం పరిశీలనలో ఉందని చెబుతున్నారు. ఏదిఏమైనప్పటికీ అన్నాడీఎంకేతో పొత్తుపై చర్చలు ప్రారంభం కావటానికి ముందుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకానికి సంబంధించి ఆ పార్టీ అధిష్టానం ప్రకటన చేయడం ఖాయమని తెలుస్తోంది.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా...

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



ఇక ఢిల్లీ నుండి తిరిగొచ్చిన అన్నామలై కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ 2020 నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పాటుపడుతున్నానని, రాష్ట్రం బాగుండాలి, రాష్ట్ర ప్రజలంతా బాగుండాలనే ఏకైక లక్ష్యంతోనే తాను పార్టీని ముం దుకు నడిపించానని చెప్పారు. రాష్ట్రంలో ఏ పార్టీ నాయకుడిపైనా తనకు వ్యక్తిగతమైన విరోధం, శత్రుత్వం లేవని, అన్నాడీఎంకే తదితర పార్టీలకు చెందిన నాయకులను తాను విమర్శించినా ప్రజల బాగు కోసమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తానెప్పుడూ పారదర్శకంగానే వ్యవహించానని, బయటొక మాట, లోపల ఒక మాట అనే చందాన ఎప్పుడూ ప్రవర్తించలేదని, తన మనస్సుకు తోచిన విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పడమే తన బాణీ అని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం తననే కొనసాగిస్తుందని ఆశపడటం లేదని, ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తానని అన్నామలై స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా రెండు మూడువారాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలైని కొనసాగిస్తూ లేదా కొత్త వ్యక్తిని ఆ పదవిలో నియమిస్తూ అధిష్టానం ప్రకటన చేస్తుందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

విజయ్ ఎక్కడ పోటీ చేస్తే అక్కడే బరిలోకి!

● పవర్‌స్టార్ శ్రీనివాసన్





టీవీకే నేత విజయ్, పవర్‌స్టార్ శ్రీనివాసన్

అడయార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ రాష్ట్రంలో ఎక్కడ పోటీ చేసినా ఆయనపై తాను పోటీ చేస్తానని తమిళ సినీ హాస్య నటుడు పవర్‌స్టార్ శ్రీనివాసన్ ప్రకటించారు. ఈ విషయంపై ఆయన సోమవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో విజయ్ ఏ స్థానం నుంచి పోటీ చేసినా తాను ఆయనకు వ్యతిరేకంగా పోటీ చేస్తానని, తద్వారా విజయ్ అభిమానుల నుంచి ఏదైనా ముప్పు ఏర్పడితే ముఖ్యమంత్రి స్టాలిన్ చూసుకోవాలని ఆయన కోరారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఇపుడు ఆరోగ్యం కుదుటపడటంతో అందరి ముందుకు వచ్చినట్టు తెలిపారు. అయితే, తన గురించి తప్పుడు ప్రచారం జరుగుతోందని, దాని గురించి తాను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తనపై వచ్చే విమర్శలు తనను మరో మెట్టుకు చేరుస్తాయన్నారు. ఏదో ఒక రోజున దేవుడు తన వద్దకు తీసుకెళ్ళేంత వరకు మీ ముందే ఉంటానని తెలిపారు. టీవీకే పేరుతో పార్టీని ప్రారంభించిన తన చిరకాల మిత్రుడు జోసెఫ్ విజయ్‌పై తనకు ఎంతో గౌరవ మర్యాదలుండేవన్నారు. అతడిని సొంత సోదరుడిగా భావించానని తెలిపారు. ఆయన వేదికలపై మాట్లాడేవన్నీ పంచ్ డైలాగులున్నాయని, వేదికపై అటూ ఇటూ చిందులేసి మాట్లాడటం బాగా లేదన్నారు. విజయ్ వీరపాండ్య కట్టబొమ్మన్ బాణీ డైలాగులన్నీ మాట్లాడుతున్నారన్నారు. వీటిలో కొన్నింటిని ప్రజలు స్వీకరిస్తారన్నారు. తాను కూడా ఒక రాజకీయ పార్టీని స్థాపించాలని భావించానని, కానీ, పరిస్థితులు అనుకూలించలేదన్నారు. 2026లో మాత్రం విజయ్ ఎక్కడ నుంచి పోటీ చేసినా అయనపై తాను పోటీ చేస్తానని ప్రకటించారు. తనను ఏ రాజకీయ పార్టీ ఆహ్వానించినా వెళ్ళి విజయ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తానని తెలిపారు. ప్రజలకు ఏం చేయబోతున్నారో చెప్పకుండా రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు గుప్పించడం భావ్యంకాదన్నారు. రాజకీయాల్లో అర్థశతాబ్దం సుదీర్ఘ అనుభవం కలిగిన డీఎంకేని కించపరిచేలా విమర్శలు చేయడం విజయ్‌కి తగదన్నారు. సభలకు వచ్చే జనసందోహాన్ని చూసి విజయ్ ఊహల్లో విహరించరాదన్నారు. అభిమానులు వేరు, ఓటర్లు వేరు అనే విషయాన్ని విజయ్ గుర్తించాలని ఏ నటుడికీ అభిమానులందరూ ఓటేసిన దాఖలాలు లేవని పవర్‌స్టార్ శ్రీనివాసన్ హితవు పలికారు.

జిబ్లీ ట్రెండ్‌లో జాయిన్ అయిన ఈపీఎస్

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) జిబ్లీ ట్రెండ్‌లో జాయిన్ అయ్యారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించిన కార్టూన్ తరహా తన బొమ్మలతో నెటిజన్లను అలరిస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లు విడదీయలేని బంధంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్‌మీడియాను ఉపయోగించేవారు తమ ఫొటోలను జపాన్ స్టూడియో జిబ్లీ బాణీ బొమ్మలుగా మార్చి పోస్టు చేస్తున్నారు. ఓపెన్ ఏఐ చాట్ జీపీటీ ఉపయోగించి ఇలాంటి యానిమేషన్ బొమ్మలను రూపొందిస్తున్నారు. తొలుత జపాన్ స్టూడియో జిబ్లీ ప్రధాని మోదీ ఫొటోలను ప్రభుత్వ, సామాజిక ప్రసార మాధ్యమాల్లో పోస్టుచేసి సందడి చేసింది. ఈ నేపథ్యంలో ఈపీఎస్ తమిళ రాజకీయరంగంలో ఆ ట్రెండ్ అనుసరిస్తున్నారు. జపాన్ స్టూడియో జిబిలీ బాణీలో తయారైన బొమ్మలను తన రాజకీయ పయనంలో మరచిపోలేని తరుణాలు ఇవేనంటూ తన ఎక్స్ పేజీలో ఉంచారు. అంతటితో ఆగకుండా తమిళుల హృదయం నుండి స్టూడియో జిబ్లీ లోకానికి- నేను మరచిపోలేని తరుణాలు కళాత్మకరూపంలో అందిస్తున్నానంటూ ఓ సందేశం కూడా పంపారు. ప్రస్తుతం ఈ వింత





ఈపీఎస్ బొమ్మలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

రిలేషన్స్‌పై సోషల్ మీడియాలో ప్రభావం

● 'శారీ' స్టోరీ ఇదే: ఆర్జీవీ

7లో..

పి.సుశీలకు 'సూర్య మగల్' అవార్డు

విరుగంబాక్కంలో లాయర్ దారుణహత్య

● డ్రైవర్ సహా ఇద్దరి అరెస్టు



లాయర్ వెంకటేశన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విరుగంబాక్కం గణపతిరాజ్ నగర్‌లో నివసిస్తున్న న్యాయవాది వెంకటేశన్ (43)ను గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు వేటకొడవళ్లతో దాడిచేసి దారుణంగా హతమార్చారు. ఈ సంఘటనకు సంబంధించి డ్రైవర్ సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు గురైన వెంకటేశన్ మృతదేహం ఆయన కార్యాలయంలో రెండు రోజులుగా ఉండటంతో దుర్వాసన వ్యాపించింది. దీంతో చుట్టుపక్కల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం ఉదయం వెంకటేశన్ కార్యాలయం తలుపులను పగులగొట్టి లోపలకు వెళ్ళి చూసినప్పుడు వంటి నిండా కత్తిపోట్లతో శవంగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ కీల్పాక్ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. వేళచ్చేరి సమీపం ఆదంబాక్కం ప్రాంతానికి చెందిన వెంకటేశన్ న్యాయవాదిగా, ముక్కులత్తోర్‌పులిపడై పార్టీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శిగా ఉన్నారు. విరుగంబాక్కం గణపతిరాజ్‌నగర్‌లోని భవనంలో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని దానిని కార్యాలయంగా మార్చుకుని అక్కడే నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం నలుగురు వ్యక్తులు వెంకటేశన్ కార్యాలయంలో చొరబడి ఆయనను దారుణంగా హతమార్చారు. ఈ విషయం పోలీసులు అక్కడి సీసీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించారు. వెంకటేశన్ తన స్నేహితుడైన సేతుపతితో పాటు న్యాయసలహా కేంద్రం నడుపుతున్నారు.. గత నెల సేతుపతిని గుర్తు తెలియని దుండగులు హతమార్చారు. ఓ స్థలం విషయమై వెంకటేశన్‌కు కొంతమంది వ్యక్తులకు మధ్య వివాదాలున్నాయని, ఇటీవల ఆయన కార్యాలయంలో స్థల వివాద పరిష్కారానికిగాను చర్చలు కూడా జరిగాయని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ స్థలవివాదం నేపథ్యంలోనే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్యకేసులో వెంకటేశన్ స్నేహితులు సహా నలుగురిపై కేసు నమోదు చేశారు. అదే సమయంలో న్యాయవాది వెంకటేశన్ భార్య తన భర్తను స్నేహితులే హతమార్చారని కొందరి పేర్లు చెప్పి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఈ హత్యకేసులో వెంకటేశన్ వద్ద డ్రైవర్‌గా పనిచేసిన కార్తీక్, రవి అనే ఇద్దరిని తిరునల్వేలి జిల్లా నాంగునేరిలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ నోట్ల ముద్రణ కేసులో డీపీఐ నేత పరారీ

● పార్టీ నుంచి తొలగించిన తిరుమా



పరారైన సెల్వం

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా అదర్‌నత్తం గ్రామంలోని పొల్లాలో షెడ్డు నిర్మించుకుని నకిలీ నోట్లను ముద్రించి చెలామణీ చేసి పరారీలో ఉన్న డీపీఐ స్థానిక నాయకుడు సెల్వం ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ విషయం వెలుగులోకి రాగానే సెల్వంను పార్టీ నుండి తొలగిస్తూ డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ ప్రకటించారు. అదర్‌నత్తం గ్రామంలో నివసిస్తున్న సెల్వం డీపీఐ కడలూరు వెస్ట్ జిలా కోశాధికారిగా ఉన్నారు. గత కొద్ది నెలలుగా ఆయన పొలాల మధ్యలో షెడ్డు నిర్మించుకుని నకిలీ ఐదువందల రూపాయల నోట్లను ముద్రించి చెలామణీ చేశాడు. ఈ నేపథ్యంలో ఆ షెడ్‌లో నకిలీ నోట్లను ముద్రిస్తున్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందటంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని తనిఖీలు జరిపారు. రూ.85వేల విలువైన నకిలీ ఐదువందల రూపాయల నోట్లు, వాకీ టాకీలు, ఎయిర్‌గన్‌లు, పిస్టల్ ఎయిర్‌గన్, కౌంటింగ్ మిషన్ తదితర వస్తువులు లభించాయి. అంతే కాకుండా పోలీసు యూనిఫామ్‌లు, నకిలీ రిజర్వు బ్యాంక్ ముద్రలు కూడా స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్ల ముద్రణ విషయం పోలీసులకు తెలిసిందని గ్రహించిన డీపీఐ నేత సెల్వం అక్కడి నుండి పారిపోయారు. ఇదిలా ఉండగా సెల్వంను పార్టీనుండి తొలగిస్తూ డీపీఐ నేత తొల్ తిరుమావేలన్ సోమవారం మధ్యాహ్నం ప్రకటన విడుదల చేశారు. పార్టీకి కళంకం తెచ్చేలా వ్యవహరించిన సెల్వం పార్టీ ప్రాథమిక సభ్యత్వం కూడా రద్దు చేసినట్లు తిరుమా తెలిపారు.

సమాచార దర్శిని

నేటినుంచి ఊటీలో సినిమా షూటింగ్‌లపై నిషేధం

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఊటీలో సోమవారం నుంచి జూన్ 5 వరకు సినిమా షూటింగ్‌లపై ఉద్యానవన శాఖ నిషేధం విధించింది. బొటానికల్ పార్క్, రోజా పార్క్, కున్నూర్ సిమ్స్ పార్క్ సహా 7 ప్రాంతాల్లో నిషేధం విధించారు. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగనుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

15న పౌష్టికాహార, అంగన్వాడీ ఉద్యోగుల ర్యాలీ

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తమిళ నూతన సంవత్సరం రోజున ముఖ్యమంత్రి స్టాలిన్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు ర్యాలీగా వెళ్లనున్నట్లు తమిళనాడు పౌష్టికాహారం, అంగన్వాడీ ఉద్యోగులు, ఆ విభాగాల మాజీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎం.వరదరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. కలైంజర్ కరుణానిధి హయాంలో అంగన్వాడీ, పౌష్టికాహార ఉద్యోగులకు కల్పించిన ప్రయోజనాలు స్మరించుకుంటూ ఈ నెల 15న గోపాలపురంలోని కలైంజర్ నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన తర్వాత ర్యాలీగా సచివాలయానికి వెళ్లి సీఎంకు శుభాకాంక్షలు తెలుపనున్నట్లు తెలిపారు.

నేటినుంచి పర్యాటకుల వాహనాలకు నిబంధనలు

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌లో పర్యాటక వాహనాలకు విధించిన నిబంధనలు సోమవారం నుంచి అమలులోకి రానున్నాయి. వేసవి నుంచి సేదతీరేలా కొడైకెనాల్‌కు పర్యాటకులు భారీగా వస్తుంటారు. అలా వస్తున్న పర్యాటకుల వాహనాలతో గంటల కొద్దీ ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ అంశంపై దాఖలైన ప్రజావ్యాజ్యం విచారించిన హైకోర్టు, పర్యాటకుల వాహనాలకు నిబంధనలు విధించింది. ఆ ప్రకారం సోమవారం నుంచి సాధారణ రోజుల్లో 4,000 వాహనాలు, వారాంతపు రోజుల్లో 6,000 వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు. పర్యాటకులు తమ వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా ఈ-పాస్ పొందాలని అధికారులు తెలిపారు.

నేటినుంచి అగస్తీశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పొన్నేరిలోని అగస్తీశ్వర ఆలయ పంగుణి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు గ్రామ దేవతకు పూజలు, 3వ తేది ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ రోజు రాత్రి 8 గంటలకు అన్న వాహనం, 4వ తేది ఉదయం 7.30 గంటలకు చంద్రప్రభ, సూర్యప్రభ ఉత్సవం నిర్వహించనున్నారు. 9వ తేది ఉదయం 9 గంటలకు రథోత్సవం, 12వ తేది ఉదయం 11 గంటలకు తిరుకల్యాణం, రాత్రి 7.30 గంటలకు ఆనందపుష్కరిణిలో తెప్పోత్సవం జరుగనుంది. 16వ తేది వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 7.30, రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తులు వివిధ వాహనాల్లో విహరిస్తూ ప్రజలకు దర్శనమివ్వనున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేటినుంచి రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గింపు

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళల పేరుతో జరిగే రిజిస్ట్రేషన్ల ఫీజులో 1 శాతం తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రానుంది. రాష్ట్రంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసే సమయంలో, ఆస్తుల విలువల్లో స్టాంప్ డ్యూటీగా 7 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 2 శాతం చెల్లించాల్సి ఉంది. మహిళల పేరుతో జరిగే రిజిస్ట్రేషన్ల ఫీజు ఒక శాతం తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. ఆ ప్రకారం, రూ.10 లక్షల విలువైన ఇళ్లు, భూములు, స్థలాలు మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేసినట్లయితే, ఫీజులో 1 శాతం రాయితీ సోమవారం నుంచి అమలుకు వస్తుందని రిజిస్ట్రేషన్ కార్యదర్శి కుమార్‌జయంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

7 నుంచి ప్రాథమిక తరగతుల వార్షిక పరీక్షలు

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య డైరెక్టరేట్ నిర్వహణలోని పాఠశాలల్లో, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈ నెల 9 నుంచి 21వ తేది వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇదివరకే ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు ఎక్కువ కావడంతో వార్షిక పరీక్షలు ముందుగానే నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రకారం, ఈ నెల 7 నుంచి 17వ తేది వరకు పరీక్షలు జరుగనున్నాయి. కొత్త టైం టేబుల్ ప్రకారం, 7 నుంచి 11వ తేది వరకు తమిళం, ఐచ్ఛిక భాష, ఇంగ్లీషు, మ్యాథ్స్ పరీక్షలు జరుగనున్నాయి. నాలుగు, ఐదు తరగతులకు 15వ తేది సైన్స్, 17వ తేది సోషల్ సైన్స్ పరీక్షలు జరుగనున్నాయి.

రాజధాని కళాశాలలో అదనపు సీట్లు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లో ఉన్న ప్రభుత్వ రాజధాని కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అదనపు సీట్లు, కొత్త కోర్సులు పరిచయం చేయాలని ఉన్నత విద్యాశాఖ నిర్ణయించింది. రాజధాని కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో మొత్తం 1,140 సీట్లుండగా, గత ఏడాది 1.3 లక్షల మంది దరఖాస్తు చేశారు. అందువల్ల 2025-26వ విద్యా సంవత్సరంలో సీట్ల సంఖ్య పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఈ ఏడాది అదనంగా 600 సీట్లు చేర్చారు. అలాగే, పలు కోర్సులకు రెండో షిఫ్ట్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో కొత్త విభాగాలు కూడా పరిచయం చేయనున్నారు. ఈ బాధ్యతలను ఉన్నత విద్యలో విశేష అనుభవం కలిగిన నిపుణుల కమిటీకి అప్పగించినట్లు సమాచారం.

పూండి జలాశయం నుంచి తాగునీరు విడుదల

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ జలాశయం నుంచి తాగునీటిని విడుదల చేస్తున్నారు. ఈ జలాశయంలో 2,520 మిలియన్ ఘనపుటడుగుల నీరుండగా రాజధాని నగరం చెన్నై వాసుల తాగునీటి అవసరాలకు జలాశయం నుంచి 184 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ఇక పూండి జలాశయం నుంచి పుళల్ జలాశయానికి 350 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి



సౌమ్య అన్బుమణిని కలుసుకున్న శాంతమూర్తి, కన్నన్

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని 'పసుమై తాయగం' అధ్యక్షురాలు సౌమ్య అన్బుమణి నేతలకు పిలుపునిచ్చారు. నగరంలో చెంగల్పట్టు దక్షిణ జిల్లా పీఎంకే కార్యదర్శి నూనంబేడు శాంతమూర్తి, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కన్నన్‌లు మర్యాదపూర్వకంగా సౌమ్యను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, పౌష్టికాహార సిబ్బందికి మొక్కల పంపిణీ, కరపత్రాల ద్వారా పర్యావరణంపై అవగాహన సహా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు ఆమెకు వివరించారు. వారిని అభినందించిన సౌమ్య సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

శ్రీలంక శరణార్థుల కుమార్తెకు భారత పౌరసత్వం

● కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి శరణార్థులుగా వచ్చిన శ్రీలంక దంపతుల కుమార్తెకు భారత పౌరసత్వం కల్పించే అంశంపై పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది. శ్రీలంకలో 1984లో జరిగిన అంతర్గత యుద్ధం కారణంగా శరవణముత్తు, తమిళ్‌సెల్వి దంపతులు అక్కడి నుంచి కోవై వచ్చారు. అనంతరం శరణార్థులుగా తమ పేర్లు నమోదుచేసుకొని కోవైలోనే నివసిస్తున్నారు. 1987లో వారికి రమ్య అనే కుమార్తె జన్మించింది. ఆ చిన్నారి కోవైలోనే పాఠశాల విద్య ముగించింది. ఈ నేపథ్యంలో, 1987 జూలై అనంతరం దేశంలో శరణార్థులకు జన్మించిన పిల్లలకు భారత పౌరసత్వం కోరరాదని పాస్‌పోర్ట్ అధికారులు ఆదేశించి, ముత్తు దంపతుల పాస్‌పోర్ట్ రెన్యువల్ నిరాకరించారు. ఇదిలా ఉండగా, భారత పౌరసత్వం కోరుతూ ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తును కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని రమ్య మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును న్యాయమూర్తి భరత చక్రవర్తిలతో కూడిన ధర్మాసనం విచారించగా పిటిషనర్ తరఫు న్యాయవాది, ప్రభుత్వ న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. చివరగా, భారత పౌరసత్వం కోరుతూ రమ్య చేసుకున్న దరఖాస్తును పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

తండ్రి మృతిచెందిన విషాదంలోనూ పరీక్షకు హాజరు



విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తండ్రి మృతి చెందిన విషాదంలోనూ పరీక్షకు హాజరైన విద్యార్థినిని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పరామర్శించి ఓదార్చారు. తిరుచ్చి జిల్లా తిరువెరుంబూర్ నియోజకవర్గం పోయిక్కైకుడి గ్రామానికి చెందిన షాలిని, తేనేరిపట్టిలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్ వన్ చదువుతోంది. గత నెల 13వ తేది షాలిని తండ్రి అనారోగ్యం కారణంగా మృతిచెందారు. అదే రోజు పరీక్ష ఉండడంతో, షాలిని తండ్రి మృతదేహానికి నమస్కరించి పరీక్షకు హాజరైంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి. నా నియోజకవర్గంలోని పోయిక్కైకుడి గ్రామానికి చెందిన ప్లస్ వన్ విద్యార్థి షాలిని, తండ్రి మృతిచెందిన సమయంలోనూ పరీక్షకు హాజరుకావడం, ఆమె విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. షాలిని ఇంటికి వెళ్లి ఆమె తండ్రి చిత్రపటానికి చల్లి నివాళులర్పించడంతో పాటు షాలినిని ఓదార్చి ఆమెకు విద్యా ఉపకార వేతనం అందజేసినట్లు మంత్రి తెలిపారు.

9వ అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెట్టేరి ప్రాంతంలో 9వ అంతస్తు నుంచి దూకి టీచర్ ఆత్మహత్యకు పాల్పడింది. ఓట్టేరి స్ట్రాన్స్ రోడ్డుకు చెందిన దినేష్ (48)-దేవిక (37) దంపతులకు దాక్షన్య (19), దర్శిక (13) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. దేవిక పురుసైవాక్కంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. కొద్దిరోజుల క్రితం ఏర్పడిన విభేదాల కారణంగా భార్యాభర్తలు సరిగా మాట్లాడుకోవడం లేదని సమాచారం. ఆదివారం ఉదయం మళ్లీ వారి మధ్య గొడవలు చెలరేగడంతో దినేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి దినేష్‌కు ఫోన్ చేసిన దేవిక 'నీతో నేను జీవించలేను... ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఆందోళన చెందిన దినేష్, భార్యకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోడంతో అతను ఇంటికి చేరుకున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో ఇంటి సమీపంలోని అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన దేవిక, 9వ అంతస్తు నుండి కిందకు దూకడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించే సమయంలో మృతిచెందింది. ఈ ఘటనపై రెట్టేరి పోలీసులు కేసు నమోదు చేశారు.

నైవేలి కేంద్రం ముట్టడించిన రైతుల అరెస్ట్



థర్మల్ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేయకూడదని డిమాండ్ చేస్తూ ఎన్ఎల్‌సీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ముట్టడించిన 400 మంది రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా నైవేలిలో ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ సొరంగాల నుంచి వెలికితీసిన నేలబొగ్గు వినియోగించి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర, కేరళ తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో, కర్ణాటక ప్రభుత్వం మెకెదాటు కావేరి నదిపై ఆనకట్ట నిర్మాణానికి రూ.9 వేల కోట్లు కేటాయించడంతో పాటు నిర్మాణపనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టింది. ఈ ఆనకట్ట ఏర్పాటుతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు సాగు నీరందక బీళ్లుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు, కర్ణాటక రాష్ట్రం ఆనకట్ట నిర్మాణాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, నైవేలీ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేయరాదని డిమాండ్ చేస్తూ రైతు సంఘా సోమవారం ఎన్ఎల్‌సీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. అక్కడ భద్రతా విధులు చేపట్టిన పోలీసులు, రైతులను అడ్డుకొని 400 మందిని అరెస్ట్ చేశారు.

రేబిస్ వ్యాధితో బాలుడి మృతి

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సేలం సమీపంలో శునకం దాడికి గురైన బాలుడు రేబిస్ వ్యాధితో మృతిచెందాడు. సేలం జిల్లా వీరాణం ప్రాంతానికి చెందిన మునుస్వామి కుమారుడు కిషోర్ (9) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గత నెల 28వ తేది బాలుడు హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు వీరాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అతనిని పరీక్షించిన వైద్యులు, కుక్క కాటుకు గురవడంతో రేబిస్ వ్యాధి సోకిందని నిర్ధారించారు. ఈ విషయమై బాలుడిని ప్రశ్నించగా, కొద్దిరోజుల క్రితం ఆడుకుంటున్న సమయంలో కుక్క కరిచినట్లు తెలిపాడు. బాలుడికి ప్రథమ చికిత్స చేసిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి పరిస్థితి విషమించి బాలుడు మృతిచెందాడు. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... కుక్క కరిచిన కొద్దిరోజులు ఈ విషయాన్ని బాలుడు తల్లిదండ్రులకు చెప్పలేదని, అందువల్ల కేకలకు సంక్రమించే రేబిస్ వ్యాధితో బాలుడు మృతిచెందినట్లు తెలిపారు.

పన్ను చెల్లించని వారి ఆస్తుల జప్తు

● నగర పాలక సంస్థ చర్యలు

అడయార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఆస్తి పన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేయాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. అలాగే, ఇకపై సెలవు రోజుల్లో కూడా ఆస్తి పన్ను వసూలు శిబిరాలను నగర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని భావిస్తోంది. చెన్నై నగర పాలక సంస్థ పరిధిలోని యజమానుల నుంచి ఆస్తి పన్ను, వాణిజ్య భవనాలకు కమర్షియల్ ట్యాక్స్‌ను కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తుంటారు. ఈ పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌లు కూడా నిర్వహించిన సందర్భాలున్నాయి. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆస్తి పన్ను చెల్లింపు గడువు మార్చి 31తో ముగిసింది. దీంతో గత యేడాది, సుదీర్ఘకాలంగా ఆస్తి పన్ను చెల్లించని యజమానులపై చర్యలకు ఉపక్రమించనుంది. ముఖ్యంగా కొన్నేళ్ళుగా పన్ను చెల్లించని ఆస్తులను జప్తు చేయాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఇదే విషయంపై కార్పొరేషన్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులను చెల్లించేలా మరో నెల రోజుల పాటు అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నాం. నిర్ణీత గడువులోగా ఈ పన్ను చెల్లించిన యజమానులకు ఒక శాతం అపరాధంతో పన్నును వసూలు చేయాలని, సుదీర్ఘకాలంగా పన్ను చెల్లించని యజమానులకు చెందిన ఆస్తులను జప్తు చేసేలా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. అందువల్ల ఇంటి యజమానులు తమ ఆస్తి పన్నును ఈ-సేవా కేంద్రాల్లో చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైలులో గంజాయి స్వాధీనం: నిందితుల పరారీ

వేలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రైలులో తరలిస్తున్న 26కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరక్కోణం వెళ్ళే రైలులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం సాయంత్రం రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ చేస్తున్న సమయంలో ఉత్తరాదికి చెందిన ఓ ప్రయాణికుడి సంచిని పోలీసులు తనిఖీ చేయగా 26కిలోల గంజాయి గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తి రైలునుండి దూకి పరారయ్యాడు.

మరో దారి లేక...!

● తిరుప్పూర్ సమీపంలో హిందీలో ప్రకటన

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు ఎక్కువగా ఉండడంతో వారి కోసం హిందీలో బోర్డులు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని తిరుప్పూర్ మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. తిరుప్పూర్ చెత్తరహిత జిల్లాగా రూపొందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. వీధులు, రోడ్డ పక్కన చెత్త వేయరాదని, పర్యావరణం పరిష్కరించేలా మొక్కలు నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో తిరుప్పూర్ జిల్లాలోని కర్మాగారాల్లో అధిక సంఖ్యలో ఉత్తరాది రాష్ట్రాల వారు పనిచేస్తున్నారు. పరిశుభ్రతపై ఉత్తరాది వాసులకు తెలియజేసేలా ప్రకటన బోర్డుల్లో హిందీలో కూడా రాసారు. ముదలిపాళయం పంచాయతి పరిధిలోని పలు ప్రాంతాల్లో తమిళంతో పాలు హిందీ పదాలు కూడా రాసారు.



తమిళంతో పాటు హిందీలో ఏర్పాటైన బోర్డు

పేకాడుతున్న ఇద్దరు మహిళల సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియాంతోపులో పేకాట ఆడుతున్న ఇద్దరు మహిళల సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పులియాంతోపు పోలీసులు అందిన సమాచారం మేరకు ఆదివారం ఎమ్మెస్ మూర్తి నగర్‌లోని ఓ ఇంటి సమీపం ఖాళీ ప్రదేశంలో తనిఖీ చేయగా, అక్కడ ఇద్దరు మహిళలు సహా ముగ్గురు పేకాడుతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు, రూ.25వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

జల్లికట్టులో గాయపడిన యువకుడి మృతి

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు ఎద్దు దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. తిరుపత్తూర్ జిల్లా పెరుమాపట్టు గ్రామంలో గత నెల 29న జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఓ ఎద్దు రంజిత్‌కుమార్ అనే యువకుడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చేరాడు. మెరుగైన చికిత్సకు చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక ఆదివారం సాయంత్రం మృతిచెందాడు.

మెరీనాలో అక్కాచెల్లెళ్ల ఆత్మహత్యాయత్నం

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు యువతులను పోలీసులు రక్షించారు. ఆదివారం రాత్రి ఇద్దరు యువతులు బీచ్‌లో తిరుగుతూ హఠాత్తుగా నీళ్లలోకి పరుగులు తీశారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న హెడ్ కానిస్టేబుల్ కుమరేశన్, సహచర పోలీసులతో వెళ్లి వారిని రక్షించారు. విచారణలో... అక్కాచెల్లెళ్లయిన వీరు తల్లిదండ్రులతో తేనాంపేట ప్రాంతంలో నివసిస్తున్నారని, వారిలో ఒకరు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, మరొకరు కళాశాలలో చదువుతోంది. తల్లిదండ్రుల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా ఇటీవల వారు వివాహ రద్దుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. దీంతో, మనస్తాపం చెందిన అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు తెలిసింది. వారిని రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కౌన్సిలింగ్ ఇప్పించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. తేని జిల్లా దేవదానంపట్టికి చెందిన ఆషిక్‌అహ్మద్ (38) మదురై అవనియాపురం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రంజాన్ పండుగ సందర్భంగా మూడు రోజులు సెలవు తీసుకున్న ఆయన కుటుంబసభ్యులతో కలసి ఆదివారం కారులో రామేశ్వరం సమీపంలోని అరియమాన్ బీచ్‌కు వెళ్లాడు. సాయంత్రం వారు తిరుగు ప్రయాణం కాగా, పరమకుడి సమీపం నొన్మణి ప్రాంతంలో రామనాథపురం చిన్నకడై వీధికి చెందిన మణికంఠన్ కారును వీరి కారు ఢీకొంది. కారు నడుపుతున్న ఆషిక్ అహ్మద్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను రక్షించి పరమకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేశారు.

రూ.5.63 కోట్లతో రోడ్ల నిర్మాణం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని శ్రీనివాసపురం గ్రామంలో రూ.5.63 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహిచామన్నారు.

47 యేళ్ల తర్వాత తిరుచ్చి నుంచి జాఫ్నాకు విమానసేవలు

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో సైనికులకు, ఎల్‌టీటీఈ ఉగ్రవాదులకు మధ్య జరిగిన యుద్ధం కారణంగా 47 యేళ్ల క్రితం నిలిపివేసిన తిరుచ్చి - జాఫ్నా విమానసేవలు పునఃప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి ఇండిగో విమాన సంస్థ ఈ సేవలను ప్రారంభించింది. ఈ విమానం తిరుచ్చి నుంచి మధ్యాహ్నం 1.25 గంటలకు బయలుదేరి 2.25 గంటలకు శ్రీలంకలోని జాఫ్నాకు చేరుతుంది. మరుమార్గంలో జాఫ్నా నుండి మధ్యాహ్నం 3.05 గంటలకు బయలుదేరే ఆ విమానం సాయంత్రం 4.05 గంటలకు తిరుచ్చి నగరానికి చేరుతుంది.

అనకాపుత్తూర్‌లో ఘనంగా 'ఉగాది' వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న తెలుగు ప్రజలు

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా అనకాపుత్తూర్‌లో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రాంతంలో నాయుడు ఉపకులాలకు చెందిన 40కి పైగా కుటుంబాలు నివసిస్తుండగా, ప్రతి ఏడాది ఉగాది వేడుకలు నిర్వహిస్తుంటారు. అనకాపుత్తూర్ బాబురెడ్డి అవెన్యూలోని డా.ఏవీ కుమార ఇల్లం ప్రాంగణంలో ఆదివారం జరిగిన వేడుకల్లో తెలుగు వారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తెలుగు అసోసియేషన్ నేతలు ఇ.కస్తూరి రంగన్, ఎం.నటరాజన్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెంచిన టోల్ టాక్స్ వాపసు తీసుకోవాలి

● ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల్లోని టోల్‌గేట్లలో పెంచిన టోల్ పన్ను వాపసు తీసుకోవాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల్లో ఉన్న 40 టోల్‌గేట్లలో సోమవారం అర్ధరాత్రి నుంచి టోల్ టాక్స్ పెరిగింది. ఈ విషయమై దినకరన్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే లైసెన్స్ ముగిసిన టోల్ గేట్లు మూసివేయాలని, వాహనాలకు అధిక పన్నులు వసూలుచేయడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని తన ప్రకటనలో తెలిపారు.

మహిళపై లైంగిక వేధింపులు

● తహసీల్దార్ అరెస్ట్

పెరంబూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన తహసీల్దార్ కటకటాలపాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు... కూడలూరు ఎక్సైజ్ విభాగం తహసీల్దార్‌గా పనిచేస్తున్న సిద్ధరాజ్ (54) కూడలూరు మనవయల్ ప్రాంతంలోని దుకాణానికి వెళ్లి కోడి మాంసం, కోడిగుడ్లు కొనుగోలు చేస్తుంటాడు. ఘటన జరిగిన రోజు దుకాణానికి సిద్ధరాజ్ వెళ్లిన సమయంలో, కోడిగుడ్లు స్టాక్ లేదని దుకాణంలోని 42 ఏళ్ల మహిళ తెలిపింది. ఆ సమయంలో సిద్ధరాజ్ హఠాత్తుగా ఆమె చేయి పట్టుకొని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొనేలోపు సిద్ధరాజ్ పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కూడలూరు పోలీసులు విచారణ చేపట్టి సిద్ధరాజ్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

గవర్నర్ భద్రతా వాహనాన్ని ఢీకొన్న బైక్

● మెడికోకు గాయాలు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి భద్రతా వాహనాన్ని బైక్ ఢీకొన్న ఘటనలో మెడికోకు గాయాలయ్యాయి. గవర్నర్ ఆదివారం మధ్యాహ్నం తిరుచ్చి వెళ్లి రాత్రి విమానంలో నగరానికి తిరిగొచ్చారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న గవర్నర్‌ను తీసుకొచ్చేందుకు గిండి రాజ్‌భవన్ నుంచి విమానాశ్రయానికి కాన్వాయ్ బయల్దేరింది. మీనంబాక్కంలోని విమానాశ్రయాన్ని కాన్వాయ్ సమీపిస్తున్న తరుణంలో, హఠాత్తుగా కాన్వాయ్‌లోకి ప్రవేశించిన ఓ మోటార్ సైకిల్ భద్రతా వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు అతడిని క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారించగా, పల్లావరంకు చెందిన సంతోష్ (24) కిలాంబాక్కంలోని ఓ ప్రైవేటు వైద్యకళాశాలలో ఫిజియోథెరపీ చదువుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రధాని మోదీకి నల్లజెండాలతో నిరసన

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పిలుపు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఈ నెల 6వ తేది రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి నల్లజెండాలతో నిరసన తెలియజేయనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి తమిళనాడు పట్ల వివక్ష చూపుతోందని, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. త్రిభాషా విద్యా విధానం పేరుతో రాష్ట్రంలో హిందీ నిర్బంధానికి కేంద్రం యత్నిస్తోందని, మరోవైపు రాష్ట్రానికి చెందాల్సిన నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలిపేలా, ఈ నెల 6వ తేది రాష్ట్రానికి రానున్న మోదీకి నల్లజెండాలతో నిరసన తెలియజేయనున్నామని, అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ ఆందోళన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో నిర్వాహకులు

వేలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నైకట్టు సమీపంలో గుండరాణి పంచాయతీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. ముఖ్యఅతిథి, జిల్లా రూరల్ డెవెలెప్మెంట్ డైరెక్టర్ సెంథిల్‌కుమార్ పుస్తక ప్రదర్శనలో రూ.6500 పుస్తకాలను పాఠశాలకు బహూకరించారు. రాష్ట్ర సైన్స్ కమిటీ అధ్యక్షుడు అముద, సెక్రటరీ జనార్ధనన్, ట్రెజరర్ సిలుపన్, తిరుపాల్, డీఎంకే నేతలు పాల్గొన్నారు.

వేలూరులో ఘనంగా రంజాన్ వేడుకలు



వేలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం, మనిధనేయ మక్కల్ కట్చి జిల్లా సెక్రటరీ సుల్తాన్ అహ్మద్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని వేలూరులోని మసీదులకు వెళ్ళి సహాయాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో వేలూరు ఆర్ఎన్ పాళయంలోని మసీదును సందర్శించి వారితో కలిసి నమాజులో పాల్గొన్నారు. అనంతరం గుడియత్తం, కాట్పాడి ప్రాంతాల్లోని మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొని ముస్లిం చిన్నారులకు సహాయాలను అందజేసి, రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు.

పుదువైలో బంగ్లా ఉగ్రవాదుల చొరబాటు?

● కర్మాగారాల్లో తనిఖీలు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో బంగ్లాదేశ్ ఉగ్రవాదులు కార్మికుల ముసుగుతో చొరబడ్డారనే సమాచారం తో ఉగ్రవాద నివారణ విభాగం ఆ రాష్ట్రంలోని కర్మాగారాల్లో సోమవారం నుండి తనిఖీలు ప్రారంభించింది.. తమిళనాడు, అసోం పోలీసులు గత 15వ తేదీ సెమ్మన్‌జేరిలో తలదాచుకున్న తీవ్రవాది అబ్బులాం అలీని అరెస్టు చేశారు. ఇందులో భాగంగా తిరుప్పూర్, సేలం, పొలాచ్చి, నామక్కల్ తదితర ప్రాంతాల్లో 45 మంది బంగ్లాదేశీయులు నకిలీ ఆధార్‌తో కార్మికులుగా పలు కర్మాగారాల్లో పనిచేస్తున్నట్లు తెలియడంతో తనిఖీలు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. ఇదిలా వుండగా, జమాతుల్ ముజాహిద్దీన్, అన్సారల్లా ఉగ్రవాద సంస్థలతో సన్నిహిత సంబంధాలున్న బంగ్లాదేశ్ ఉగ్రవాదులు ఉత్తరాది కార్మికుల పేరుతో పుదుచ్చేరిలో పనిచేస్తున్నట్లు కేంద్ర ఇంటిలిజెన్స్ విభాగం హెచ్చరించింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం ఆ రాష్ట్రంలోని పలు కర్మాగారాల్లో తనిఖీలు చేసి, పనిచేస్తున్న వలస కార్మికుల వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

రిలేషన్స్‌పై సోషల్ మీడియా ఎలాంటి ప్రభావం చూపుతుంది?


● 'శారీ' స్టోరీ అదే అంటున్న ఆర్జీవీ


మీడియా సమావేశంలో ఆరాధ్య, ఆర్జీవీ, సత్యదేవ్ తదితరులు

నేటి సమాజంలో మానవ సంబంధాలపై సోషల్ మీడియా ఎలాంటి ప్రభావం చూపుతుందన్న కథాంశంతో తెరకెక్కిన చిత్రమే 'శారీ' అని ఆ చిత్ర నిర్మాత రాంగోపాల్ వర్మ అన్నారు. ఆర్జీవీ ఆర్‌వీ ప్రొడక్షన్ ఎల్ఎల్‌పీ పతాకంపై రవిశంకర్ వర్మ నిర్మించారు. రాంగోపాల్ వర్మ స్క్రీన్‌ప్లే అందించగా, గిరికృష్ణ కమల్ దర్శకత్వం వహించారు. ఈ నెల 4వ తేదీ తమిళం, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో హీరోయిన్ ఆరాధ్యదేవి మాట్లాడుతూ, 'నేను కేరళ అమ్మాయిని. ఈ చిత్రంలోని పాటలతో పాటు స్టోరీ కూడా మీకు నచ్చుతుంది. ఇందులో గర్ల్ నెక్స్ డోర్ అనే పాత్ర పోషించాను. సోషల్ మీడియాలోని నెగెటివిటీ, డార్క్ సైడ్స్ ఈ మూవీ వివరిస్తుంది. ఆరాధ్య పాత్రలో నటించే అవకాశం ఇచ్చిన వర్మకు ధన్యవాదాలు' తెలిపారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ, 'యూపీ వాసిని. ఇది నా తొలి చిత్రం. గతంలో కొన్ని టీవీ సీరియల్స్‌లో నటించాను. ఇది ఒక సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. ఈ స్టోరీ కేవలం మహిళలకు మాత్రమే కాదు పురుషులకు కూడా కనెక్ట్ అవుతుంది' అన్నారు. నిర్మాత రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ, 'ప్రతి చిత్రానికి ఒక ఇతివృత్తం ఉంటుంది. సోషల్ మీడియా సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తం. ఒక్కోసారి చెడు సంఘటనలు సంబంధాలపై విపరీతమైన ప్రభావం చూపి ఎడబాటుకు దారితీస్తుంది. ఆరాధ్య పాత్రలాగే చాలా మంది మహిళలపై సోషల్ మీడియా ప్రభావం ఉంది. ఈ విషయాన్నే 'శారీ'లో చెప్పాం' అని పేర్కొన్నారు.

'సర్దార్' కాన్సెప్ట్ విని షాకయ్యా!

● హీరో కార్తి


'సర్దార్'లో కార్తి

'సర్దార్ రెండో భాగానికి సంబంధించి దర్శకుడు పీఎస్ మిత్రన్ చెప్పిన కాన్సెప్ట్ విని తాను షాకయ్యాయని, ఇది వెండితెరపై ప్రేక్షకులను మరింతగా భయపెడుతుందని హీరో కార్తి అన్నారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి హీరోగా రూపొందుతున్న చిత్రం 'సర్దార్-2'. ఈ సినిమాలో విలన్ పాత్రను పరిచయం చేస్తూ రూపొందించిన ప్రత్యేక వీడియోను సోమవారం విడుదల చేశారు. ప్రతినాయకుడి పాత్రను ప్రముఖ దర్శకనటుడు ఎస్‌జే సూర్య పోషించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కార్తి మాట్లాడుతూ, 'సర్దార్ సినిమా విడుదలయ్యాక చాలా మంది వాటర్ బాటిల్స్ కొనుగోలు చేయడానికి భయపడ్డారు. ఈ మూవీ రెండో భాగం కథ చూస్తే ప్రేక్షకుడు తప్పకుండా కంగారుపడతారు. ఆ మూవీలో అంత బలమైన సందేశం ఉంది. ఇలాంటి మూవీలో ఎస్‌జే సూర్య భాగం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎస్‌జే సూర్య మాట్లాడుతూ, 'సర్దార్ నాకెంతో నచ్చింది. మిత్రన్ నన్ను కలిసి స్టోరీ వినిపించినపుడు తప్పకుండా ఈ మూవీలో నటించాలని అనిపించింది. ఇందులోని పాత్ర ఒక నటుడిగా నన్నెంతో సవాల్ విసిరింది. ఈ సినిమా విశేష ఆదరణ సొంతం చేసుకుంటుందని నమ్ముతున్నా. ఇది ఖచ్చితంగా గొప్ప పాన్ ఇండియా మూవీ అవుతుందన్నారు. మాళవికా మోహనన్, ఆషికా రంగనాథన్, రజిషా విజయన్ హీరోయిన్లుగా నటించే ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మాతలు ఎస్.లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనాలు కలిసి నిర్మిస్తున్నారు.

తమిళ చిత్రజ్యోతి

జీ5 ఓటీటీలో 'చెరుప్పుగల్ జాగ్గిరతై'


'చెరుప్పుగల్ జాగ్గిరతై' వెబ్‌సిరీస్ బృందం

జీ5 సమర్పణలో రూపొందిన వెబ్‌సిరీస్ 'చెరుప్పుగల్ జాగ్గిరతై'. ఈ నెల 28వ తేదీ నుంచి జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో విజయవంతంగా స్ట్రీమింగ్ అవుతోంది. కామెడీ సిరీస్‌లో ఎస్ గ్రూపు నిర్మాణంలో సింగారవేలన్ నిర్మించగా, డైరెక్టర్ రాజేష్ సూసైరాజ్ దర్శకత్వం వహించారు. ఇందులో ప్రధాన పాత్రను సింగంపులి, వివేక్ రాజగోపాల్, ఐరా అగర్వాల్, లొల్లు సభ మనోహర్, ఇంద్రజిత్, హుస్సేన్, సబిత, ఉడుమలై రవి, పళని, సేవల్ రామ్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు నటించారు. అభిమానులను కడుపుబ్బ నవ్వించేలా రూపొందించారు. వెబ్‌సిరీస్ దర్శకుడు రాజేష్ సూసైరాజ్ మాట్లాడుతూ, 'జీ5 కౌశిక్ వల్లే ఈ వెబ్‌సిరీస్ సాధ్యమైంది. 'ఐందామ్ వేదం' ద్వారా ఆయన పరిచయమయ్యారు. చిత్రీకరణ సమయంలో ఏ చిన్న సందేహం వచ్చినా ఆయన నివృత్తి చేస్తారు. నిర్మాత సింగారవేలన్ నిర్మాతగా కంటే ఒక మంచి మనిషి. వీరిద్దరి కారణంగానే నా దర్శకత్వం కల సాకారమైంది. సింగంపులి ఆధిపత్యం చెలాయిస్తారని పలువురు చెప్పారు. కానీ లొకేషన్‌లో ఆయన అలా నడుచుకోలేదు. ఐరా అగర్వాల్ చలాకీ యువతి. షూటింగ్ లొకేషన్‌లోనే ఎన్నో రీల్స్ చేసి మాకు చూపించేవారు. ఇలా ఈ వెబ్‌సిరీస్ ఎంతో సాఫీగా సాగిపోయింది. ఇందులో నటించిన ప్రతి ఒక్క ఆర్టిస్ట్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.


దుషారా విజయన్

విశాల్ సరసన దుషారా?

కోలీవుడ్ యంగ్ హీరోయిన్ దుషారా విజయన్‌కు మరో ఛాన్స్ వరించింది. హీరో విశాల్ సరసన హీరోయిన్‌గా నటించనున్నారు. విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కే ఈ చిత్రంలో కథానాయికగా నటించేందుకు సంతకాలు చేశారు. అధర్వ నటించిన 'ఈట్టి', జీవీ ప్రకాష్ 'ఐంగరన్' వంటి చిత్రాలను రూపొందించిన దర్శకుడు రవి అరసు... తన తదుపరి చిత్రాన్ని విశాల్‌తో తెరకెక్కించనున్నారు. ఈ మూవీలో విశాల్ హీరోగా నటిస్తూ, సొంతంగా నిర్మిస్తున్నారు. కాగా, గతంలో 'సర్పట్టా పరంబరై', 'రాయన్', 'వేట్టయన్' వంటి చిత్రాల్లో నటించిన దుషార.. తాజాగా విక్రమ్ సరసన 'వీర ధీర శూరన్' సినిమాలో నటించగా, ఈ మూవీ ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో విశాల్ - దుషార విజయన్ ప్రాజెక్టుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.


అతిథులు, సత్కార గ్రహీతలతో సీటీఏ నిర్వాహకులు

ఉగాది తెలుగు వారి సంప్రదాయ పండుగ

ఆదాయ పన్నుశాఖ కమిషనర్ కోమలికృష్ణ ● సీటీఏ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు


ఐటీ కమిషనర్ కోమలి కృష్ణను సత్కరిస్తున్న కె.గోపాలకృష్ణారెడ్డి, బి.వెంకయ్యనాయుడు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది తెలుగువారి సంప్రదాయ పండుగ అని ఆదాయపన్ను శాఖ కమిషనర్ కోమలి కృష్ణ పేర్కొన్నారు. మధురవాయల్‌లోని సీతాలక్ష్మీ కల్యాణమండపంలో చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) వలసరవాక్కం ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం 4.15గంటలకు సంఘ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి అధ్యక్షతన ప్రార్థన, జ్యోతిప్రజ్వలన, పంచాంగ పఠనంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా చెన్నై ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ డి.కోమలికృష్ణ, గౌరవఅతిథులుగా ప్రముఖ సినీగేయ రచయిత భువనచంద్ర, సినీనటి సుధ, సీనియర్ నటుడు నరసింహరాజు, ఐఎస్‌డీఎస్ రీజనల్ డైరెక్టర్-చెన్నై కె.శ్రీనివాసరావు, రవీణ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్ హాజరై సీటీఏ సేవలను కొనియాడారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులందరిని సంఘం తరుఫున అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శి బి.వెంకయ్యనాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ నేపథ్య గాయకులు రాము, ప్రముఖ సినీ సంగీత దర్శకులు తమన్ సతీమణి గాయిని శ్రీవర్ధిని తెలుగు చలనచిత్రాల్లోని పాటలు ఆలపించారు. అలాగే ప్రముఖ నృత్యకారిణి కల్పన శ్రీనివాస్ సారథ్యంలో కళాకారులు భరతనాట్యం ప్రదర్శించారు. సీటీఏ సభ్యులు సురేష్, నాగరాజు, రామయ్య, డాక్టర్ ఏవీ శివకుమారీ, రమణయ్య, సుధాకర్, విజయేందరరావు, ఎం.చలపతి, రామారావు, రాంప్రసాద్, సుధీర్, దశరథ్, శ్రీకాంత్, మధుకర్, రఘునాధరెడ్డి, శ్రీనుబాబు తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

టామ్స్ ఆధ్వర్యంలో....


గొల్లపల్లి ఇశ్రాయేలును సన్మానిస్తున్న నిర్వాహకులు

స్థానిక వేళచ్చేరి మైలైబాలాజీనగర్‌లో తమిళనాడు ఆది ఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) ఆధ్వర్యంలో తెలుగు ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా టామ్స్ వ్యవస్థాపకులు, జనోదయం సాంఘిక విద్యాసంఘ డైరెక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు, 188వ డివిజన్ కౌన్సిలర్ సమీన సెల్వం పాల్గొని విద్యార్థులకు విద్యాసామగ్రి మహిళలకు చీరలు ఉగాది కానుకగా పంపిణీ చేశారు.

పుల్లాపురంలో ...


కన్నిమెరకల కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కీల్పాక్ సమీపంలోని పుల్లాపురం ఆదిఆంధ్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయం త్రం 6 గంటలకు సంఘ అధ్యక్షులు ఇరకట్ల నాగభూషణం అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో గ్రామప్రజలు, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన ముగ్గులు, ఫుట్‌బాల్, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యదర్శి కన్నిమెరకల కుమార్ , కోశాధికారి జి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్ఎస్‌హెచ్ అధ్యక్షుడిగా డాక్టర్ రాజా సభాపతి


ఐఎఫ్ఎస్ఎస్‌హెచ్ నిర్వాహకులతో డాక్టర్ రాజా సభాపతి

అడయార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఫర్ సర్జరీ ఆఫ్ ది హ్యాండ్ (ఐఎఫ్ఎస్ఎస్‌హెచ్) అధ్యక్షుడిగా కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాస్టిక్, హ్యాండ్ అండ్ మైక్రోసర్జరీ చైర్మన్ డాక్టర్ రాజా సభాపతి బాధ్యతలు స్వీకరించారు. మార్చి 28న వాషింగ్టన్ డీసీలో ఫెడరేషన్ సదస్సు జరిగింది. ఇందులో ఐఎఫ్ఎస్ఎస్‌హెచ్‌కు చెందిన 62 సభ్య దేశాల సమాఖ్యకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే తెలుగు ప్రజలకు భవిష్యత్తు

ఏఐటీఎఫ్ అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి ● ఘనంగా కావాంగరై తెలుగు సంక్షేమ సంఘ ఉగాది సంబరాలు



నూతన కార్యవర్గ కమిటీతో ఆచార్య సీఎంకే రెడ్డి, తాళ్లూరి సురేష్, లయన్ జి.మురళి తదితరులు

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో నివసించే తెలుగు ప్రజలంతా ఐక్యతతో ఉంటేనే మాతృభాషను కాపాడుకోవడంతో పాటు హక్కులను కూడా సాధించుకోవచ్చని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి ఉద్ఘాటించారు. రెడ్‌హిల్స్ సమీపంలోని పుళల్ కావాంగరై తెలుగు సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది సంబరాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీదేవీ భూదేవీ సమేత పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం పంచాంగ పఠనంతో ప్రారంభమైన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆచార్య సీఎంకే రెడ్డి, గౌరవ అతిథులుగా ఏఐటీఎఫ్ కార్యదర్శి నాయకర్ నందగోపాల్, ఉపాధ్యక్షులు లయన్ వీజీ జయకుమార్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాళ్లూరి సురేష్, ద్రావిడ దేశం పార్టీ అధ్యక్షులు ఒంటెల కృష్ణారావు పాల్గొని, సంఘ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఎంపికైన కొత్త కమిటీని సభకు పరిచయం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సంఘ గౌరవ అధ్యక్షులు లయన్ జి.మురళి, చీఫ్ కో-ఆర్డినేటర్ జీవీ రామకృష్ణ, అధ్యక్షులు పి.నరసింహారావు, కార్యదర్శి ఎం.చిట్టిబాబు, ట్రెజరర్ ఎం.మునుస్వామి, ఉపాధ్యక్షులు బి.కృష్ణయ్య, డి.గోపాలకృష్ణ, ఐ.వెంకటేశ్వర్లు, ఉపకార్యదర్శులు బి.బాలాజీ, వి.బాబూజీ, నాగరాజు, సలహాదారు జి.వెంగయ్య, బి.గురువారెడ్డి, బి.దామోదరంశెట్టి, బి.నాగేంద్రప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించి అతిథులకు జ్ఞాపికలు సన్మానించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆరుద్ర నాట్యాలయం, శ్రీగృహన్ జాలీ భరతనాట్య అకాడమీ కళాకారులు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అలాగే అరుళ్ అరసి అనే విద్యార్థికి విద్యాసాయంగా వి.బాబూజీ, కవిత దంపతులు రూ.20వేలు అందజేశారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రాలు

● ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి


చలివేంద్రం ప్రారంభిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న నేపథ్యంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. ఆ మేరకు సేలం జిల్లాలోని సూరమంగళంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎడప్పాడి పళనిస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు మంచినీళ్లు, తాటిముంజలు, కొబ్బరిబొండాలు, ద్రాక్ష, బత్తాయి జ్యూస్, మజ్జిగ, రాగి అంబలి, పుచ్చకాయలు తదితరాలను ఉచితంగా పంపిణీ చేశారు.

వీఆర్ మాల్‌లో పేజ్3 లగ్జరీ సెలూన్


సెలూన్ ప్రారంభిస్తున్న కయదు లోహర్

అడయార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమంగళంలోని వీఆర్ మహల్‌లో ఏర్పాటు చేసిన పేజ్3 లగ్జరీ సెలూన్‌ను కోలీవుడ్ హీరోయిన్ కయదు లోహర్ ప్రారంభించారు. పేజ్3 లగ్జరీ సలూన్ సీఈవో షణ్ముఖ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కయదు లోహర్ మాట్లాడుతూ, స్వీయ సంరక్షణ, ఆత్మవిశ్వాసం, అందం ప్రాముఖ్యతను వెల్లడించారు. పేజ్3 ప్రయాణం ఇది ఒక మైలురాయి అని సీఈవో షణ్ముఖ కుమార్ పేర్కొన్నారు. ఈ బ్రాండ్ శ్రేష్టతను నిరూపించేలా అత్యాధునిక సేవలను అందిస్తాయని పేర్కొన్నారు.

వెంగంపేటలో ఘనంగా ఉగాది సంబరాలు


పోటీల్లో పాల్గొన్న గ్రామస్థులు



తెలుగు భాషలో ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న రంగవల్లిక

తిరుత్తణి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా వెంగంపేటలోని తెలుగువారు ఘనంగా ఉగాది సంబరాలు జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోవున్న వెంగంపేట గ్రామంలో సుమారు 300లకు పైగా తెలుగు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఉగాది సందర్భంగా గ్రామస్థులు ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి ఉగాది పచ్చడి, ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా సోమవారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా గ్రామ పరిసరాల్లో తెలుగు భాషలో ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న రంగవల్లిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పి.సుశీలకు 'సూర్య మగల్' అవార్డు

● నేడు అందజేయనున్న మంత్రి శేఖర్‌బాబు

అడయార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 35 మంది మహిళలకు 'సూర్య మగల్' అనే పేరుతో నగర పాలక సంస్థ అవార్డులు ప్రదానం చేయనుంది. మంగళవారం సాయంత్రం ప్యారీస్‌లోని రాజా అన్నామలై మండ్రంలో జీసీసీ మేయర్ ఆర్.ప్రియ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. రాజకీయ, ఆర్థిక, క్రీడా, కళలు, సాహిత్యం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, పరిశోధన, మానవవనరులు, వైద్యం, సమాచారం, సాంకేతిక వంటి వివిధ రంగాల్లో విశేషంగా రాణించిన 35 మంది మహిళలను ఎంపిక చేసి వారికి సూర్య మగల్ పేరుతో అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఇందులో పలువురు సినీ నటులు కూడా పాల్గొనున్నారు. ప్రముఖ రచయిత శివశంకరి, నేపథ్యగాయని పి.సుశీల, నటి సీఆర్ విజయకుమారి, తమిళ పండితురాలు, ప్రొఫెసర్ శారద నంబి, టీఏఎఫ్ఈ ఫౌండర్ మల్లికా శ్రీనివాసన్, అపోలో ఆస్పత్రి వైస్‌ప్రెసిడెంట్ ప్రీతిరెడ్డి సహా 35 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ సభ్యులు పాల్గొనున్నారు.


పెరంబూరులోని మురసొలిమారన్ పార్కు మరమ్మతు పనులను మేయర్ ప్రియా, ఇతర అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు


చెన్నై నందనం ఎంసీ రాజా గెస్ట్‌హౌస్ ప్రాంగణం వద్ద రూ.44.50 కోట్లతో నిర్మించిన ఆదిద్రావిడుల, గిరిజన విద్యార్థుల హాస్టల్ భవన సముదాయాన్ని సోమవారం ఉదయం పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం


చెన్నై కొళత్తూరులో పెరియార్ ప్రభుత్వ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేస్తూ రోగుల వద్ద వారికి అందిస్తున్న చికిత్సలు గురించి అడిగితెలుసుకుంటున్న మంత్రులు ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ